## 83వ అధ్యాయం

## ٨٣ ـ بَابُ النَّهْيِ عَنْ تَوْلِيَةِ الإِمَارَةِ وَالْقَضَاءِ وَغَيْرِهِمَا مِنَ الْوِلَايَاتِ لِمَنْ سَأَلَهَا أَوْ حَرَصَ عَلَيْهَا فَعَرَّضَ بِهَا

## పాలనాధికారాలను, న్యాయమూర్తి పదవిని అడిగేవారికి లేదా కాంక్షించేవారికి అలాగే వాటికోసం పైరవీలు చేసుకునేవారికి ఆ హోదాలు ఇవ్వకూడదు

٦٨٠ ـ عن أبي موسى الأشعريِّ رضي الله عنه قال: دَخلتُ على النبيِّ ﷺ أنَا وَرَجُلَانِ مِن بَني عَمِّي، فقالَ أحَدُهُمَا: يا رسولَ اللهِ! أمِّرْنَا على بَعضِ مَا وَلَّاكَ اللهُ، عَزَّ وَجَلَّ، وَقالَ الآخَرُ مِثْلَ ذٰلِكَ، فقال: «إنَّا وَاللهِ! لا نُوَلِّي هذا العَمَلَ أحَداً سَألَه، أو أحَداً حَرَصَ عليهِ» متفقٌ عليه.

680. హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) కథనం : ఓ రోజు నేను మా బాబాయి కుమారులిద్దరితో కలిసి దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళాను. వారిద్దరిలో ఒకతను దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ, "దైవప్రవక్తా! దేవుడు మిమ్మల్ని రాజ్యాధినేతగా చేసిన ప్రాంతాలలో కొన్నింటికి మమ్మల్ని గవర్నర్లుగా నియమించండి" అని కోరాడు. రెండొవతను కూడా అదే కోరిక కోరాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) (చిరుకోపంతో), "దైవసాక్షి! పదవులకోసం అప్పీలు చేసుకునే వారికి, పదవీ వ్యామోహపరులకు మేము ఈ పదవీ బాధ్యతల్ని అప్పగించం" అని ఖరాఖండీగా చెప్పేశారు.

(బుఖారీ - ముస్లిం)

*(సహీహ్ బుఖారీలోని ఆదేశాల ప్రకరణం, సహీహ్ ముస్లింలోని నాయకత్వ ప్రకరణం)*

### ముఖ్యాంశాలు

పదవీ కాంక్షాపరులు సాధారణంగా తమ స్వార్థప్రయోజనాల కోసమే ప్రభుత్వ పదవుల్ని చేజిక్కించుకోవటానికి ప్రయత్నిస్తారు. దానివల్ల దేశప్రజల ప్రయోజనాలు దెబ్బతింటాయి. ప్రభుత్వం ఏర్పడేది సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడటం కోసమేగాని కొద్దిమంది బడావ్యక్తుల పబ్బం గడవటం కోసం కాదు. ప్రజల కోసం ఏర్పడే ప్రభుత్వం ఆ ప్రజల ప్రయోజనాలనే కాపాడలేకపోయినప్పుడు ఇక ఆ ప్రభుత్వం ఉండి లాభమేంటి?